



శివరామకృష్ణస్వామి ఉపన్యాసం దాదాపు ముగుస్తోంది పది గంటలు దాటుతోందేమో! ఆరుబయట కావడంవల్ల చల్లని గాలివీస్తూ విశ్వనాధాన్ని అసహనంగా కదిలిస్తోంది. కాని వేదాంతంపట్ల విశ్వనాధానికున్న అభిరుచి కదలనివ్వడంలేదు అతని స్నేహితులు విశ్వనాధం మీద చేసే మొదటి కంప్లైంట్ యిదే "క్రైం బ్రాంచ్ సూపరిండెంటెంట్‌గా వుంటూ నీకిదేం పాడుబుద్ధి? నువ్వు చేసే ఉద్యో

గానికీ ఫిలాసఫీకి అమడదూరం వుంటుంది బహుశ నేరస్థుల్ని గుర్తుపట్టడంలో నీకు తెలీకుండా నువ్వే పొరబాట్లు చేస్తావని నీ మనసుకు అనిపిస్తూ వుండొచ్చు దానివల్ల వచ్చే పాపాల్ని కడిగేసుకోవడం కోసం ఫిలాసఫీ అంటే యింట్రెస్టు చూపిస్తున్నావు" అనేవాళ్ళు

అలాంటి కామెంట్లకు అన్నింటికీ విశ్వనాధానిది ఒకటే జవాబు చిరునవ్వు మరీ అవసరమైతే "వేదాంతాన్ని తీసి పడెయ్యకండి నా ఉద్యోగ నిర్వహణలో నేరస్థుల్ని పట్టడానికి యీ ఫిలాసఫీ ఒక్కోమారు ఉపయోగపడుతుంది" అనేవాడు సరదాగా నవ్వుతూ

శ్రద్ధగా స్వామీజీ ఉపన్యాసం వింటున్న విశ్వనాధానికి అప్పుడే తన పక్కనెవరో కొత్తగా వచ్చి కూర్చున్నట్టయి తల తిప్పి చూశాడు ఇన్‌స్పెక్టర్ వీరాస్వామి

చిరునవ్వు నవ్వుతూ, "నీక్కూడా పుట్టిందా యీ పిచ్చి?" అన్నాడు చనువుగా

వీరాస్వామి హాట్ తీసి బుఱ్ఱ తడుముకుంటూ "పిచ్చిపట్టడం నిజమేగాని యీ పిచ్చి మాత్రం కాదు ఓ వెధవ కేసు రెండురోజుల్నుండీ ప్రాణాలు తీసేస్తోంది" అన్నాడు.

స్వామిజీ ఉపన్యాసంలో ముగించబడే ధోరణి కనిపించింది "అ అహాన్ని విసర్జించగలిగిన స్థితి మానవునికి చాలా కష్టసాధ్యం 'అహం' అనేది మనిషికి గుర్తురాని క్షణం వుండదు అసంకల్పితంగా కూడా 'నేను' అన్న భావన అలాగే వుండిపోతుంది తీవ్రమైన క్రమశిక్షణ, తపస్సుతో 'నేను ను మరిచిపోవచ్చుగాని, అప్పటికీ ప్రయత్నం లేకుండానే అంటే తనకే తోచకుండా 'నేను' బయటపడుతుంది " ఉపన్యాసం సాగిపోతోంది

వీరాస్వామి యిబ్బందిగా కదుల్తూ విశ్వనాధంతో "మీకోసమే వచ్చాను ఈ 'నేను' వ్యవహారం తర్వాత తేల్చుకుందురుగాని ఒక నిమిషం అవతలకి వస్తారా?" అన్నాడు

అప్పుడప్పుడూ మ్రింగుడు పడని వ్యవహారాలు అడ్డుపడితే వీరాస్వామి విశ్వనాధంతో తనకున్న పరిచయాన్ని స్నేహాన్ని ఉపయోగించుకుంటూ సలహాలకు వచ్చేవాడు

విశ్వనాధం మారుమాట్లాడకుండా పైకిలేచి బయటికి దారితీస్తూ, "నీకాంప్లికేటెడ్ కేసేమిటో చెప్పు" అన్నాడు

వీరాస్వామి మూడ్‌లో పడిపోయి సీరియస్ ముఖం పెట్టి "సాధారణమైన ఎత్తు, కోటేరు లాంటి ముక్కు, ఎర్రని చాయ బెత్తెడన్నర గడ్డం ఉన్నవాళ్ళు యీ మహా పట్టణంలో ఎంతమంది వున్నారో తేల్చమంటే నీకెలా వుంటుంది? నాకు మాత్రం రెండు వీశెల ఆముదం తాగినట్టుంది నేనిందాకా చెప్పానే లక్షణాలు- అలాంటి గడ్డపు వెధవలు ఎనిమిది వందలనల్భైమంది చచ్చారు యీ వూళ్ళో "- ఊపిరిపీల్చుకోటానికి ఆపాడు

"గడ్డాల వాళ్ళమీద ఎప్పట్నుంచీ మోజుపుట్టిందేవిటి? స్టాటిస్టిక్స్ తీసినట్టున్నావు"

"నా ఖర్మకాలి యీ దౌర్భాగ్యపు ముండాకొడుకుల వెంటబడ్డాను "

"ఏ కేసుకు సంబంధించి వెతుకుతున్నావ్?" అసలు విషయానికి రమ్మన్నట్టు అడిగాడు విశ్వనాథం

"చంపాలాల్ నాలుగు లక్షల వ్యవహారం తెలిపినప్పట్నుంచీ"

"హైదరాబాద్ బ్రాంచ్ నుండీ యిన్ఫర్మేషన్ వచ్చింది కదూ వాడు యీ వూళ్ళోనే వున్నట్టు!"

"ఔను దాంట్లో ఏ మాత్రం సందేహంలేదట రెండురోజులు లోపల వాణ్ణి పట్టుకోలేకపోతే నేనెందుకూ పనికిరానని స్టేట్‌మెంట్ యివ్వటాని క్కూడా ఏమీ సందేహం లేదట "

"వాడి డీటైల్స్ యింకా ఏమైనా అందాయా?"

"ఫోటో చూశాను వెధవ బెత్తెడన్నర గడ్డమూ వాడూనూ ఆ గడ్డం లేకపోతే వాడు ఉత్త చవటలాగుంటాడేమోనని నా అనుమానం అందుకే యీ గడ్డాల దౌర్భాగ్యుల వెంట పడ్డాను దరిచేరేవన్నీ నత్తగుల్లలన్నట్టు నా కనిపించే గడ్డపు సార్వభౌములందరూ భిక్షాటన చక్రవర్తులూ, లక్షాధికారులూనూ అటు వాళ్ళలో ఎవర్నీ యిటు వీళ్ళలో ఎవర్నీ అనుమానించలేక పోతున్నాను "

"చంపాలాల్ యీ ఊరికి వచ్చికూడా గడ్డం ఉంచుకునే వుంటాడని గ్యారంటీ ఏవిటి? శుభ్రంగా తీసి పడేసి వుండొచ్చు గదా "

"ఇలాంటి చొప్పదంటు ఆలోచన్లు మన క్రైంబ్రాంచ్ వాళ్ళకి సులభంగా వస్తాయని వాడా గడ్డాన్ని ఆపద్బాంధవిలా అలాగే ఉంచేసుకొని వుంటే?"

"రైటే! నీ బుఱ్ఱలోకి కూడా ఐడియాలు వచ్చేస్తున్నాయంటే నాకు నమ్మబుద్ధేయడంలేదు "


"నువ్వు మరీ వీరాస్వామిని అంత తక్కువగా అంచనా వెయ్యటానికి వీల్లేదు బ్రదర్ పైగా యీ కేసుసు యీ వూళ్ళో గడ్డం రాజులు ఎనిమిందల నలభై మంది వున్నారని తేల్చెయ్యడంతో ఆపెయ్యలేదు నేను అనుమానితుణ్ణి ఒకణ్ణి జాబితాలోకి ఎక్కించేశాను నేను అనుమానించానంటే దానికి తిరుగులేదన్న సంగతి నీకూ తెలుసుగా!"

"ఎవరావ్యక్తి?"

"ఎవడో శంకర్రావట మనోరమా లాడ్జిలో దిగాడు వందయూపాయల నోట్లతో కోట్లు కుట్టించుకున్నట్టు తిరుగుతుంటాడు వాడు ఏ లోకం నుంచీ దిగాడో అంతుపట్టకుండా వుంది. వాణ్ణి డైరెక్టుగా అప్రోచ్ అయి ఎంక్వయిరీ చేద్దామంటే గుండెలు చాలడంలేదు "

"ఎందుకని?"

"పోయిన సంవత్సరం యిలాంటి కేసే ఒకటి తగిలి ఒక మహానుభావుణ్ణి అనుమానించాను ధైర్యం చేసి డైరెక్ట్ ఎంక్వయిరీ మొదలు పెట్టేసరికి అతగాడు ఛీఫ్‌మినిస్టర్ బావగారి చెల్లెల మొగుడని తేలింది ఆ వ్యవహారం నుంచి నా ఉద్యోగానికి భంగం రాకుండా బయటపడేసరికి చావు తప్పి కన్ను లొట్టపోయినంత పనయింది శంకర్రావుకూడా ఏ మినిస్టర్ వుంచుకున్న దాని తమ్ముడో అయితే




అనవసరంగా బజార్న పడాల్సి వస్తుం దేమో అని అనుమానిస్తున్నాను"

"ఇంతకూ యిప్పుడు నీ బాధేవిటి? ఆ గడ్డపు వెధవ చంపక్‌లాల్ యీ శంక రావు యిద్దరూ ఒకటి అవునా కాదా తేల్చుకోవాలి అంతేనా?"

"అక్షరాలా"

"ఇందాకా దీనికి స్వామీజీ సొల్యూ షన్ చెప్పాడు 'నేను' అన్న ఫీలింగ్‌ని వదిలిపెట్టడం అసాధ్యం అన్నాడు"

"నీ వరస చూస్తుంటే తాతాచార్యు లకూ పీర్ల పండక్కీ సంబంధం వుందనేటట్టున్నావు"

"వున్నదీ లేనిదీ రేపు చెబుతాను ఈ రోజుకు హాయిగా రెస్ట్ తీస్కుకో" వీరా స్వామి చేతిని ఆప్యాయంగా నొక్కుతూ విశ్వనాథం ఆలోచనతో ముందుకు నడిచాడు

* * *

ప్రపంచమంతా హాయిగా వున్నందుకు సంతోషపడుతూ శంకర్రావు యీవెనింగ్ వాక్ నుండి హోటల్ రూముకు వస్తు న్నాడు

రోడ్డు పలచగా వుంది శంకర్రావు దృష్టి రోడ్డు పక్కనున్న అశోక చెట్ల మీదికి వెళ్తోంది

తన పక్క నెవరో సంశయంగా చూస్తూ నిలబడే సరికి తనూ ఆగి ఆ వ్యక్తి ముఖంలోకి 'ఎవరా' అనుకుంటూ నిశితంగా చూశాడు

ఆ చూపే చాలన్నట్టు ఆ వ్యక్తి గబ గబా నాలుగడుగులు శంకర్రావుకు దగ్గ రగా వేసి "నా దగ్గరో పార్కర్ పెన్ను

వుంది కొంటారాసార్!" అన్నాడు

శంకర్రావుకు యింకోమారు పరీక్షగా ఆ వ్యక్తి వంక చూశాడు పార్కర్ పెన్నును అమ్మడం కాదుగదా కనీసం కల్లోనైనా చూసి వుంటాడా అన్న అనుమానం వచ్చింది అతనికి

తన మనసులో కలిగే భావాల్ని చూపుల్లో పూర్తిగా వ్యక్తం చెయ్యకుండా "చూస్తాను యిటివ్వు" అన్నట్టు చెయ్యి చూసాడు

పాంటుజేబులో లక్ష రూపాయల చెక్కును అతి జాగ్రత్తగా దాచుకున్నట్టు, ఆ వ్యక్తి పెన్నును బయటికి తీసి శంకర్రావు చేతికిచ్చాడు అది పార్కర్ పెన్నే! సందేహం లేదు

"ఇది నీ సొంతమేనా?" పెన్నును ఓ ఆగంతకుణ్ణి ఓ కంటితో పరీక్షగా చూస్తూ అడిగాడు శంకర్రావు

ఆ వ్యక్తి అభిమానం దెబ్బతిన్నట్టు అతని ముఖంలో మారిన రంగులే చెప్పాయి "నేను కొనడం లేదు అంటే నేనేమీ బాధపడేది లేదు కాని అలాంటి మాటలు మాత్రం అనకండి ఇలాంటి పెన్నులు వంద దానం చెయ్యగలిగినంత స్టేటస్‌లో బ్రతికిన వాణ్ణే నేనొకప్పుడు కాలం కలిపిరాక యిలా అయ్యాను గాని " మాటలు మింగుతూ పెన్నును వాపసు యిచ్చెయ్యమన్నట్టు చేయి ముందుకు చాపాడు

శంకర్రావు అలాంటి వాళ్ళను వేల మందికి పైగా చూసి వుంటాడు సరదాగా నవ్వేస్తూ," ఏదో అనేశాను మనసులో పెట్టుకోకబ్బాయ్! యింతకూ ఎంతివ్వమంటావ్" అన్నాడు

"పదో పదిహేనో" ఆ వ్యక్తి కళ్ళలో మళ్ళీ ఆశ చిగురించింది

"తొమ్మిది రూపాయలు యిస్తాను" అంతకంటే ఎక్కువ గాని తక్కువగాని ఏ మాత్రమూ యివ్వనన్నట్టు ఖరాఖండీగా చెప్పి "అసలింతకూ యీ పెన్ను రాస్తుందో లేదో చూడాలి" అన్నాడు

ఇంకో పాంట్ జేబునుండి ఆ వ్యక్తి ఓ నోట్‌బుక్ లాగి "రాసి చూడండి" అన్నాడు

శంకర్రావుకు పెన్ను నచ్చింది అది రాయడం బట్టి చూస్తే కొత్త పెన్ను లాగానే వుంది జేబులో నుండి కొత్త పదిరూపాయల కాగితం తీసి అతనికిస్తూ, "పోనీ పది వుంచుకో కష్టాల్లో వున్నట్టున్నావు" అని ముందుకు నడిచాడు

* * *


శంకర్రావ్ తను కొత్తగా కొన్న పెన్నుతో డైరీ రాసుకుంటున్నాడు

అతని ఏకాగ్రతను భగ్నం చేస్తూ తలుపు చప్పుడవటంతో లేచి వెళ్ళి తలుపులు తీశాడు

ఎదురుగా పోలీసులు బ్రమాన్పడిపోయాడు శంకర్రావ్

"మిస్టర్ చంపాలాల్ యువార్ అండర్ అరెస్ట్" అన్నాడు పోలీసుల్తో బాటు లోపలికి అడుగుపెట్టిన ఆఫీసర్

శంకర్రావుకు అంతా అయోమయంగా వుంది పోలీసులు తన్నెలా గుర్తు పట్టగలిగారు? తన ఆచూకీ తెలిసేట్టు తనే




ప్పుడు ప్రవర్తించాడు? అతడి మస్తిష్కంలో వేలకొద్దీ ప్రశ్నలు పుట్టుకొచ్చాయి పోలీస్ సూపరింటెండెంట్ వంక దీక్షగా చూసిన అతని కళ్ళు సమాధానం దొరికినట్టు మెరిశాయి

అది గమనించిన విశ్వనాధం నవ్వుతూ "యువర్ గెస్సింగ్ యీజ్ అక్యురేట్లీ కరెక్ట్ మిస్టర్ చంపాలాల్! మీకు పార్కర్ పెన్ను అమ్మింది నేనే" అన్నాడు

* * *

"ఇంతకూ యీ కేసునిప్పుడు ఎవరు సాధించినట్టు?" సీరియస్‌గా అడిగాడు వీరాస్వామి విశ్వనాధాన్ని

"మనిద్దరమూ మటుకు కాదు. ఈ గొప్పదనమంతా శివరామకృష్ణస్వామీజీ గారిది ఆయన ఉపన్యాసంలోని చివరి మాటలు ఆ రోజువిన్నావుగా! 'నేను'ను సాధారణమైన మానవులు మరచిపోవడము అసాధ్యము అసంకల్పితంగా తనను తెలీకుండానే ఆ'నేను' బయటపడుతుంది అని ఈ సూత్రాన్నే నేను ప్రాక్టికల్‌గా ప్రూవ్ చేశాను శంకర్రావు తనే చంపాలాల్ అని తనంతట తనే బయటపెట్టుకున్నాడు"

"ఎప్పుడు?"

"నేను అమ్ముతున్న పార్కర్ పెన్ను సరిగా రాస్తుందో లేదోనని పరీక్షించినప్పుడు ఆ పెన్నుతో అతను కాగితం మీద ట్రై చేసింది 'చంపాలాల్' అనే అక్షరాలను" □